జంక్షన్.. టెన్షన్!

- చౌటుప్పల్‌లోనూ 'ట్రిపుల్ ఆర్' భూ మాయ!
- జంక్షన్ విస్తరణతో 2.5రెట్లు పెరిగిన భూసేకరణ
- గతంలో 78 ఎకరాలు.. ఇప్పుడు 181 ఎకరాలు!
- మాల్స్, మల్టీప్లెక్స్‌ల కోసం పేదల భూములకు ఎసరు
- చౌటుప్పల్ జంక్షన్ విస్తరణపై ప్రభుత్వ పెద్దల మౌనం
- సీఎంకే తెలుసు.. ఆయననే అడగాలన్న మంత్రి కోమటిరెడ్డి
- తనకేమీ తెలియదని ఎమ్మెల్యే రాజగోపాల్ దాటవేత
- అలైన్‌మెంట్ మార్పుతో రెండుగా చీలనున్న చౌటుప్పల్
- విస్తరణ వద్దని ముక్తకంఠంతో భూబాధితుల డిమాండ్

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టాలని చూస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో రోజుకో కొత్త కోణం వెలుగు చూస్తున్నది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన అలైన్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తమకు అనుకూలంగా అటు ఇటు మార్చుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వద్ద ఉత్తర–దక్షిణ భాగాలు కలిపేచోట ట్రిపుల్ ఆర్ జంక్షన్‌ను విస్తరించడం కలకలం రేపుతున్నది. ఇక్కడ జంక్షన్ విస్తరణ ఏరియా ఉన్నట్టుండి రెండున్నర రెట్లకు పెరగడం గమనార్హం. ఫలితంగా ఇప్పటికే కోట్లల్లో విలువ చేసే వ్యవసాయ భూములతోపాటు లక్షల విలువైన ప్లాట్లు, ఇండ్లు పోనున్నాయి. దీంతో ఈ ప్రాంత రైతులు, సామాన్య ప్రజలు రెండు నెలలుగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. జిల్లా మంత్రితో పాటు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ ఇలా ఎవరు కనిపిస్తేవారిని తమను కాపాడాలంటూ వేడుకుంటున్నారు. వీరి ఆవేదనకు, ఆక్రోశానికి పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వ పెద్దలు మౌనం వహిస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తున్నది.

చౌటుప్పల్ పట్టణానికి ఆనుకుని తూర్పు వైపున హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై రీజినల్ రింగ్ రోడ్డులో ఉత్తర, దక్షిణ భాగాలు కలిపే జంక్షన్‌ను ప్రతిపాదించారు. దాదాపు ఈ జంక్షన్ చౌటుప్పల్ మున్సిపాలిటీ మధ్యలోనే ఏర్పాటు కానుంది. గతంలో ఉత్తర భాగం అలైన్‌మెంట్ ఖరారు చేసే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఇక్కడ జంక్షన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దక్షిణభాగం అలైన్‌మెంట్‌ను ఈ జంక్షన్‌కు అనుసంధానం చేస్తూ ముందుకు కొనసాగించనున్నారు. అయితే ఈ సమయంలో ఇక్కడ వాహనాల ఇంటర్ చేంజ్ వ్యవస్థ కోసం, సర్వీసు రోడ్లు తదితర అవసరాల కోసం 78 ఎకరాల భూసేకరణ అవసరం అవుతుందని ప్రకటించింది. ఆ ప్రకారమే క్షేత్ర స్థాయిలో అప్పట్లోనే సర్వేబృందాలు మార్కింగ్ కూడా చేసి స్థానికులకు స్పష్టతనిచ్చాయి. దీనివల్ల కొంతమొత్తంలో వ్యవసాయ భూములతోపాటు మున్సిపాలిటీ పరిధిలోని ప్లాట్లు, ఇండ్లు కూడా పోతున్నాయి. ఇందులో భూములు, ప్లాట్లు పోతున్న వారిలో కొంత మంది ముందే ప్రతిపాదిత జంక్షన్ ఏరియా దాటి ఇండ్ల కోసం ప్లాట్లు కొనుగోలు చేయడం, వాటిల్లో తిరిగి ఇండ్ల నిర్మాణాలను మొదలు పెట్టడం చేశారు. కానీ ఉన్నట్టుండి ఈ జంక్షన్ ఏరియా రెండింతలకు పైగా పెరగడంతో తీవ్ర అలజడి మొదలైంది. దీనివల్ల చౌటుప్పల్ మున్సిపాలిటీ కూడా రెండుగా చీలిపోనున్నది. 1,2,3 వార్డుల పరిధిలోని లింగారెడ్డిగూడెం, తాళ్లసింగారం, లింగోజిగూడెం ట్రిపుల్ ఆర్‌కు మరోవైపు విడిపోనున్నాయి.

181 ఎకరాలకు పెరిగిన విస్తరణ

చౌటుప్పల్ వద్ద తలపెట్టిన జంక్షన్ విస్తరణ ఉన్నట్టుండి భారీగా పెరిగింది. వచ్చే 50 ఏండ్ల అవసరాలను దృష్టి పెట్టుకుని ఈ జంక్షన్ వద్ద అత్యాధునిక వసతులతో కూడిన మల్టీప్లెక్స్‌లు, హోటళ్లు, టెర్మినల్స్ లాంటివి నిర్మించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. అందు కోసం ఇప్పుడే భూసేకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో రెండేండ్ల కిందటే ఇక్కడ ఓఆర్ఆర్ తరహాలోనే ఇంటర్ చేంజ్ వ్యవస్థ కోసం 78 ఎకరాల భూమి అవసరమవుతుందని గుర్తించారు. దీనికి సంబంధించిన క్షేత్రస్థాయిలో భూసర్వే పూర్తి చేసి మార్కింగ్ కూడా చేశారు. తాజాగా దక్షిణ భాగం రింగ్‌రోడ్డును నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న

భావిస్తూ ఆ మేరకు అలైన్‌మెంట్‌లో సైతం జోక్యం చేసుకుంటున్న విషయం తెలిసిందే. దక్షిణభాగంలో గతంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన అలైన్‌మెంట్‌ను కాదని రాష్ట్ర ప్రభుత్వ 'సొంత' అవసరాల పేరిట అటుఇటు మార్పులకు సిద్ధపడింది. అందులో భాగమే చౌటుప్పల్ వద్ద జంక్షన్ విస్తరణ కూడా అన్న చర్చ సాగుతున్నది. జంక్షన్ విస్తరణ ఏరియాను పెంచడం వల్ల కోల్పోతున్న వ్యవసాయ భూములు, ప్లాట్ల సంఖ్య భారీగా పెరుగుతున్నది.

పెద్దోళ్ల కోసం పేదోళ్లను బలిపెడతారా?

విజయవాడ–హైదరాబాద్ హైవేపై ప్రయాణించేవాళ్ల విందులు, వినోదాల కోసం తమ భూములు లాక్కోవడం ఏమిటని స్థానిక రైతులు, ప్లాట్ల యజమానులు ప్రశ్నిస్తున్నారు. జంక్షన్ అంటే వాహనాల ఇంటర్ చేంజ్, టోల్ ప్లాజాల లాంటివి సర్వసాధారణం. కానీ ట్రిపుల్ ఆర్‌లో ఇతర జంక్షన్ల వద్ద ఎక్కడా లేని విధంగా హోటళ్లు, టూరిజం ప్లాజాలు, టెర్మినల్స్, మల్టీప్లెక్స్‌ల్లాంటి అదనపు సౌకర్యాల కోసం ఒక్కసారిగా 181 ఎకరాలకు జంక్షన్ ఏరియాను పెంచడం ఎంతవరకు సబబు అని వారు నిలదీస్తున్నారు. ఏపీ ప్రయాణికుల ఆనందం కోసం తమను బలిచేయడం సరికాదంటున్నారు. దశాబ్దాల తరబడి భూములనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, అలాంటి భూములను ఎవరి సౌకర్యాల కోసమో లాక్కోవడం ప్రభుత్వ పెద్దలకు సరికాదని వారు చెప్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇప్పటి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి లాంటి వారంతా అలైన్‌మెంట్‌లో పోతున్న భూముల విస్తీర్ణం మరింత తక్కువగా ఉండేలా చూస్తామని, ఆ భూములకు కూడా బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇప్పిస్తామని నమ్మబలికారని బాధిత రైతులు చెప్తున్నారు. ఇప్పుడు కొత్త అలైన్‌మెంట్ పేరుతో రెండున్నరరెట్లు ఎక్కువగా భూములను లాక్కుంటున్నారని, దీనిపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక మొహం చాటేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

పూర్తిగా భూములు కోల్పోతున్న కుటుంబాలెన్నో

హైవేకు దక్షిణభాగంలో జంక్షన్ పరిధిని పెంచడం వల్ల తంగడపల్లికి చెందిన జాల అనే ఇంటి పేరు కలిగిన యాదవ కుటుంబాలకు చెందిన వ్యవసాయ భూమి ముప్పావు వంతు కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. జాల కుటుంబంలో పూర్వీకుల నుంచి వస్తున్న వారసత్వ భూమి 110 ఎకరాల ఉండగా దీని ఆధారంగా ప్రస్తుతం 35 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గతంలో 2009లో హైవే విస్తరణలో కొంత భూమిని వీరు కోల్పోయారు. గతేడాది కిందట సోలార్ పవర్, దివీస్ ల్యాబ్, ఏపూరు వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు టవర్ల కోసం వీళ్లే మరికొంత భూమిని కోల్పోయారు. 'పాత అలైన్‌మెంట్ ప్రకారం 35 ఎకరాల వరకు భూమి పోతుండె. సగం పోయినా.. సగం భూమైనా మిగులుతుందని అనుకున్నం. కానీ జంక్షన్ పరిధి పెంచడంతో కొత్త మార్కింగ్‌లను బట్టిచూస్తే సుమారు 80 ఎకరాల వరకు భూమి పోతున్నది. జాల ఇంటిపేరున్నవారిలో సగం కుటుంబాలకు చెందిన భూమి మొత్తం ఇందులోనే పోతున్నది' అని జాల శ్రీశైలం వాపోయారు. ఇక్కడ ఎకరం భూమి రూ.3 కోట్ల నుంచి 4కోట్ల వరకు ఉన్నదని, ప్రభుత్వం రూ.35లక్షలు ఇస్తే ఎట్లా అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఒక్క ఎకరం డబ్బులు పెడితే ఇదే చౌటుప్పల్‌లో 150 గజాల ప్లాటు కూడా వచ్చే పరిస్థితి లేదని జాల అంజయ్య ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా జాల వారి కుటుంబంలో ప్రతిఒక్కరూ జంక్షన్ విస్తరణ బాధితులే కావడం గమనార్హం. కొద్ది కాలంగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని పలువురు ప్లాట్ల యజమానులు కంటతడి పెట్టారు. పాత ప్లాన్ ప్రకారం 78 ఎకరాల్లోనే జంక్షన్ నిర్మాణం చేపడితే బాధితుల సంఖ్య తగ్గి, వారికి కొంత భూమైనా మిగులుతుందని వారు వాపోతున్నారు.

కోమటిరెడ్డి బ్రదర్స్ తీరుపై ఆగ్రహం

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ట్రిపుల్ఆర్ ఉత్తరభాగం అలైన్‌మెంట్, సర్వే సమయంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గత ప్రభుత్వంపై ఒంటికాలిపై లేచేవారు. రాయగిరి ప్రాంతంలో రైతులు ఆందోళన చేస్తుంటే వెళ్లి మరీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అలైన్‌మెంట్ మార్చడంతోపాటు బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇస్తామని నమ్మబలికారు. కానీ నేడు రాయగిరి రైతులకు ఆయన ముఖం చాటేశారు. తీరా ఇప్పుడు ఆయన మంత్రిగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమే 'సొంత' అవసరాల పేరు ట్రిపుల్ ఆర్ సౌత్‌లో అలైన్‌మెంట్ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో చౌటుప్పల్ జంక్షన్ విస్తరణ బాధితులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని పలుమార్లు కలిసే ప్రయత్నం చేశారు. ఓసారి నల్లగొండలో, పలుమార్లు హైదరాబాద్‌లోని ఇంటికి వెళ్లే గంటలకొద్దీ వేచి ఉన్నా కనీసం కన్నెత్తి చూడలేదని బాధితులు వాపోతున్నారు. ఒకసారి ఆయన చౌటుప్పల్ మీదుగా వెళ్తున్నప్పుడు దారి మధ్యలో కలిశామని వారు చెప్పారు. 'ట్రిపుల్ ఆర్ అంతా సీఎం రేవంత్‌రెడ్డే చూస్తున్నడు. నాకేం తెల్వదు. మీకు కావాలంటే ఆయననే కలవండి' అంటూ ఆగకుండా వెళ్లిపోయాడని బాధితులు వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని పలుమార్లు కలిసిన బాధితులకు నిరాశే ఎదురైంది. 'అలైన్‌మెంట్‌లో మార్చడం మన చేతుల్లో ఉండదు. మార్చేందుకు నేనేమో మంత్రిని కాదు. కలెక్టర్‌కు చెప్పి కేంద్రానికి లేఖ రాపిద్దాం. బహిరంగ మార్కెట్ రేట్ కోసం నా వంతు ప్రయత్నం చేస్తా' అంటూ కలెక్టర్‌కు ఫోన్ చేసి చేశారని బాధితులు చెప్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ముఖ్య నేతలు ఓట్ల కోసం ఎకరానికి కోటి రూపాయల వరకు పరిహారం ఇస్తామని కూడా చెప్పినట్టు ట్రిపుల్ఆర్ బాధితులు గుర్తు చేస్తున్నారు. కానీ ఇప్పుడు ఎవరూ తమ గోడును వినిపించుకోవడం లేదని వారు కన్నీరుమున్నీరవుతున్నారు.

చౌటుప్పల్ పోరాటంపై వామపక్షాల మౌనం

పేదల పక్షాన నిలుస్తాయని కొంతలో కొంత వామపక్షాలకు పేరుండేది. కానీ రేవంత్‌రెడ్డి పాలనలో వారి వైఖరి కూడా మారింది. ప్రజాపోరాటాలు పక్కకు వెళ్లిపోయాయి. ఒకనాడు ప్రపంచబ్యాంకుపై యుద్ధం చేసిన వామపక్షం.. ఇప్పుడు ముఖ్యమంత్రి అదే పాట పాడినా కనీసం వ్యతిరేకించడం లేదు. అలాగే చౌటుప్పల్ రైతులను బజారుపాలు చేస్తున్న జంక్షన్ విస్తీర్ణం మార్పుపైనా వారు పెదవి విప్పడంలేదు. శనివారం ఏచూరి సంస్మరణ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోరిన సీపీఎం నేతలు.. తర్వాత ఆయనను కలిశారు. చౌటుప్పల్ భూబాధితుల సమస్యను ప్రస్తావించారు. 'నిర్ణయం జరిగిపోయింది. ఇప్పుడు వెనక్కి పోలేం. కావాలంటే రైతులకు పరిహారాన్ని పెంచే అంశాన్ని పరిశీలిస్తాం' అని సీఎం రేవంత్ సమాధానమిచ్చారట. ఆ తర్వాత కూడా వారి నుంచి నిరసన స్వరం వినిపించలేదు. కార్యాచరణ ఏదీ ప్రకటించలేదు. ఎప్పటిలాగే వామపక్షం మౌనంగానే ఉండిపోయింది.

నిత్యం ఆందోళన పథం

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో జంక్షన్ పరిధి పెంచడంతో ప్లాట్లు, ఇండ్లు, వ్యవసాయ భూములు కోల్పోతున్న నిర్వాసితులంతా గత కొద్ది రోజులుగా ఆందోళనలు, ధర్నాలు చేస్తున్నారు. పార్టీలకు అతీతంగా అఖిలపక్షంగా ఏర్పడి నిరసనకు దిగారు. పలుమార్లు జంక్షన్ ఏరియాతో పాటు చౌటుప్పల్ ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపట్టారు. భువనగిరి కలెక్టరేట్ ఎదుట కూడా ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కూడా బాధితుల తరపున కలెక్టర్‌ను కలిశారు. ఈ క్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, స్థానిక ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని సైతం బాధితులు పలుమార్లు కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అయినా ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న మంత్రి వెంకట్‌రెడ్డి లాంటి పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు.

హైవేకు ఇరువైపులా 1350 మీటర్ల చొప్పున..

తాజా మార్పులు చేర్పుల తర్వాత చౌటుప్పల్ జంక్షన్‌ను హైవేకు ఇరువైపులా 1,350 మీటర్ల పొడవునా 'డంబెల్' ఆకారంలో నిర్మాణం కానున్నది. దీనివల్ల రెండువైపులా కలిపి అదనంగా రైతుల నుంచి 103 ఎకరాల భూమిని సేకరించాల్సి వస్తున్నది. ఫలితంగా భూబాధితుల సంఖ్య భారీగా పెరుగుతున్నది. రెండు నెలల కిందట గుట్టుచప్పుడు కాకుండా సర్వేకు ప్రభుత్వం ఆదేశించింది. సర్వే బృందాలు భూ యజమానులతో సంబంధం లేకుండా మార్కింగ్ చేయడం మొదలుపెట్టాయి. తంగడపల్లి శివారులోని వ్యవసాయ భూముల్లో కొత్తగా సర్వే చేస్తున్న విషయం తెలుసుకున్న రైతులు.. వారిని అడ్డుకున్నారు. ఆ తర్వాత పోలీసు బృందాలను వెంటేసుకుని రైతులను బలవంతంగా అక్కడి నుంచి తరలించి సర్వేను కొనసాగించడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పాత అలైన్‌మెంట్ ప్రకారం భూములు తీసుకుంటే తమ భూముల్లో కొంతైనా మిగిలేదన్నది రైతుల వాదన. కొత్త అలైన్‌మెంట్, జంక్షన్ విస్తరణ వల్ల తమకున్న భూములు, ప్లాట్లన్నీ ఇందులోనే పోతున్నాయని రైతులు వాపోతున్నారు. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న భూములే తమకు జీవనాధారమని, ఉన్న భూమంతా జంక్షన్ పేరుతో లాక్కుంటే తామెలా బతకాలని వారు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

తొలగిన 'గాంధీ' ముసుగు

- సీఎల్పీ సమావేశానికి ఫిరాయింపు ఎమ్మెల్యేలు
- ఇప్పడేమంటారని బీఆర్ఎస్ నిలదీత
- సీఎంను కలిసేందుకేనన్న మంత్రి శ్రీధర్‌బాబు
- ఇంకా బుకాయించొద్దని మాజీ మంత్రి హరీశ్ ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ అంతర్గత సమావేశం సాక్షిగా ఆ పార్టీ నేతలు చెప్తున్నవన్నీ శుద్ధపూస మాటలని,ఆడుతున్నవన్నీ నాటకాలేనని తేలిపోయింది. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహా ప్రకాశ్‌గౌడ్, దానం నాగేందర్, కడియం శీహరి కప్పుకొన్న ముసుగు తొలగిపోయింది. న్యాయ స్థానాల నుంచి, శాసనసభ నిబంధనల నుంచి తప్పించుకునేందుకే వీళ్లు నాటకాలాడుతున్నారని స్పష్టమైంది. ఆదివారం సీఎల్పీ (కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ) సమావేశానికి ఫిరాయింపు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. వీళ్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే అయితే సీఎల్పీ సమావేశానికి ఎలా హాజరయ్యారన్న ప్రశ్న తలెత్తుతున్నది. కారు గుర్తుపై గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలకు సీఎల్పీ సమావేశంలో చోటు కల్పించడంపై రాజకీయ ప్రముఖులే ముక్కున వేలేసుకుంటున్నారు. శేరిలింగంపల్లి నుంచి కారు గుర్తుపై గెలిచిన అరికెపూడి గాంధీ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరటం, ఆయనను పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ సర్కార్ నియమించడం తెలిసిందే. ఇది దుష్ట సంప్రదాయమని, ఆనవాయితీ ప్రకారం పీఏసీ చైర్మన్ పదవి ప్రతిపక్ష సభ్యుడికే ఇవ్వాలని బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తున్నది. గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా తన ఇంటికి వస్తే భోజనం పెట్టి కేసీఆర్ వద్దకు తీసుకెళ్తానని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చెప్పటం, అనంతరం గాంధీ రౌడీ మూకను వెంటేసుకొని కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనపై హత్యాయత్నం చేయటం తెలిసిందే. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన పీఏసీ తొలి సమావేశంలోనూ బీఆర్ఎస్ సభ్యులు ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. శాసనసభ సంప్రదాయాలకు, నిబంధనలకు విరుద్ధం గా చైర్మన్ ఎంపికతో పాటు, కమిటీ కూర్పు కూడా అభ్యంతరకరంగా ఉన్నదని నిలదీశారు. అప్పుడు కూడా మంత్రి దుద్దిళ్ల శీధర్‌బాబు స్పీకర్ నిర్ణయాన్ని వెనకేసుకొచ్చారు. అరికెపూడి గాంధీ ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉన్నారని, ఆయనకు కాంగ్రెస్ పార్టీకి సంబంధంలేదని శీధర్‌బాబు మరోమారు చెప్పుకొచ్చారు. గాంధీ సీఎల్పీ సమావేశాలకు హాజరు కావటం బట్టి చూస్తే.. ఆయన కాంగ్రెస్‌లోనే ఉన్నాడని మరోసారి రుజువైందని, అధికార పార్టీ కండువా కప్పుకొన్న వ్యక్తి, ప్రతిపక్ష సభ్యుడినని చెప్పుకొని పీఏసీ చైర్మన్ పదవి తీసుకోవటం గౌరవ శాసన సభను మోసం చేయటమేనని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కలిసి శాసనసభకు తప్పుడు సమాచారం ఇచ్చి, స్పీకర్‌ను తప్పుదోవ పట్టించారని స్పష్టంచేస్తున్నారు. స్పీకర్‌కు, ఉన్నత న్యాయస్థానానికి తప్పుడు సమాచారమిచ్చిన వారిపై వెంటనే అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు అరికేపూడి గాంధీ సీఎల్పీ సమావేశానికి హాజరైన వీడియోను మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా పోస్ట్ చేయటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మర్యాదపూర్వకంగా కలిసిండు : శ్రీధర్‌బాబు

సీఎల్పీ మీటింగ్ జరిగిన హోటల్ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోనే ఉన్నదని, సీఎంను మర్యాదపూర్వకంగా కలిసేందుకు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వచ్చారని, సీఎల్పీ మీటింగ్‌కు రాలేదని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన నియోజకవర్గానికి సీఎం వచ్చినప్పుడు శాసనభ్యుడు కలిస్తే తప్పా? అని ప్రశ్నించారు. అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలపైనా శ్రీధర్‌బాబు ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'సిద్దిపేటకు ముఖ్యమంత్రి వస్తే హరీశ్‌రావు వెళ్లే ప్రయత్నం చేయరా? అని ప్రశ్నించారు.

ఇది పరమ అమర్యాద : హరీశ్ ఎద్దేవా

'పిల్లి కండ్లు మూసుకొని పాలు తాగిన ట్టుగా మంత్రి శ్రీధర్‌బాబు వైఖరి ఉన్నది' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవాచేశారు. సీఎల్పీ సమావేశానికి ఫిరాయింపు ఎమ్మెల్యేల హాజరుపై కాంగ్రెస్ బుకాయించడం తగదని ఆదివారం ఎక్స్ వేదికగా హితవుపలికారు. 'బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ కండువా కప్పి దేవుడి కండువా అని బుకాయిస్తారు. సీఎల్పీ సమావేశానికి హాజరైతే మర్యాదపూర్వక కలయిక అంటారు. ఎమ్మెల్యేలు కడియం నుంచి అరికెపూడి దాకా కాంగ్రెస్ ఎల్పీ మీటింగ్‌కు హాజరైతే అది మర్యాద కాదు.. పరమ అమర్యాద అవుతుంది శ్రీధర్‌బాబు గారు.. ఈ చిన్న లాజిక్ మిస్ అయిపోయారు మీరు. నా నియోజకవర్గానికి ముఖ్యమంత్రి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా వస్తే కలుస్తానేమో.. కానీ ఎల్పీ మీటింగ్‌కు వస్తే కలవను కదా? కలవకూడదు కదా? ఒక పార్టీ ఎమ్మెల్యే మరో పార్టీ ఎల్పీ సమావేశానికి ఎట్లా హాజరవుతాడు?' అని నిలదీశారు.

రైతు మెడకు.. ట్రిపుల్ ఆర్ మెలిక

- ప్రజెంటేషన్‌లో ఉన్నట్టు ప్రదేశంలో లేదు
- శివన్నగూడెం వరకు 2-4 కిలోమీటర్ల దూరం
- కొత్త మ్యాపులో లేకున్నా క్షేత్రస్థాయిలో మార్క్

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబరు 22 (నమస్తే తెలంగాణ): ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మెలికలు తిరుగుతూనే ఉన్నది. మ్యాపుల్లో లేకున్నా క్షేత్రస్థాయిలో మాత్రం 'గుర్తులు' వెలుస్తున్నాయి. తాజాగా చౌటుప్పల్ పరిధిలో నుంచి నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడెం వరకు ఏకంగా 2–4 కిలోమీటర్ల మేర అలైన్‌మెంట్ బయటికి జరుగుతున్నట్టు తెలిసింది. కొన్నిరోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి ఎదుట అధికారులు ఇచ్చిన ప్రజెంటేషన్‌లో కొత్త అలైన్‌మెంట్‌ను ప్రదర్శించిన విషయం తెలిసిందే. ఈ ప్రజెంటేషన్‌లో చౌటుప్పల్ పరిధిలో పెద్దగా మార్పు కనిపించలేదు. కల్వకుర్తి నియోజకవర్గంతోపాటు చేవెళ్ల, వికారాబాద్ పరిధిల్లోనే భారీ ఎత్తున మార్పులు చేశారు. అయితే నాలుగైదు రోజులుగా చౌటుప్పల్ పరిధిలోనూ పాత అలైన్‌మెంట్‌లో మార్పుల దిశగా ముమ్మర సర్వే కొనసాగుతున్నట్టు తెలిసింది. ఈ మార్పు సీఎం రేవంత్ ఎదుట ప్రదర్శించిన పీపీటీలో లేదు. అంటే ప్రజెంటేషన్ తర్వాత కూడా మార్పుల ప్రక్రియ కొనసాగుతున్నట్టు స్పష్టమవుతున్నది. మూడు రోజుల కిందట ప్రజల ముందే ట్రిపుల్ ఆర్ సర్వే జరిగిన దృశ్యాలు మీడియాలో కూడా వచ్చాయి. ముఖ్యంగా చౌటుప్పల్ నుంచి సంస్థాన్ నారాయణపురం, జనగామ ఆపై పుట్టపాక అటునుంచి శివన్నగూడెం వరకు ఒక్కోచోట ఒకలా సగటున 2 నుంచి 4 కిలోమీటర్ల వరకు అలైన్‌మెంట్‌ను బయటికి జరుపుతున్నట్టు తెలిసింది. ఆపై భట్లపల్లి వరకు యథావిధిగా కొనసాగించి తర్వాత సీఎం రేవంత్ ఎదుట ఇచ్చిన పీపీటీలోని కొత్త అలైన్‌మెంట్‌కు అనుసంధానించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా యాదాద్రి–భువనగిరి జిల్లాలో ఎందుకు మార్పు చేస్తున్నారనేది ఆ ప్రాంత గ్రామాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రధానంగా పొలాల్లో గుర్తులు పెడుతుండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఉత్తర భాగం నుంచి వస్తున్న రింగ్‌రోడ్డు కొత్త అలైన్‌మెంట్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రకారం.. చౌటుప్పల్ నుంచి శివన్నగూడెం వరకు రింగ్‌రోడ్డు లోపలికి జరిగినట్టుగా ఉండి ఆపై భారీ వంకర కనిపిస్తున్నదని, అందుకే రింగు మాదిరిగా వచ్చేందుకు చౌటుప్పల్ పరిధిలోనూ బయటకు జరుపుతున్నారని అధికారికవర్గాల సమాచారం. అంటే ప్రభుత్వ పెద్దల భూముల సమీపంలోకి రింగు రోడ్డును తీసుకుపోవడం వల్ల అసలు రింగురోడ్డు రూపం దెబ్బతిన్నందున ఈ సర్దుబాటు చేస్తున్నారా? లేక ఈ మార్పులోనూ కొందరు పెద్దల ప్రయోజనాలు దాగి ఉన్నాయా? అనేది తేలాల్సి ఉన్నది.

రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరు

గత ఎన్నికల్లో రైతుల ఒత్తిడి మేరకు అలైన్‌మెంట్ మారుస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పిండ్రు. ఉన్న రోడ్లను పెంచుకుంటే సరిపోతుంది. కొత్త రోడ్లు ఎందుకని అన్నరు. అధికారుల మార్కింగ్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరు. సప్పిడోళ్లగూడెంలో మామిడి నర్సిరెడ్డికి భూమి పూర్తిగా పోవడంతో గుండె ఆగిపోయి చనిపోయిండు. ఇప్పటికైనా అధికారులు అలైన్‌మెంట్ మార్చాలి.

- బూర్గు కృష్ణారెడ్డి, రైతుసంఘం నాయకులు, మందోళ్లగూడెం

28 కిలోమీటర్లు కుదించడం సరికాదు

కొంతమంది స్వార్థం కోసమే అలైన్‌మెంట్ మారుస్తున్నరు. రెండోసారి మార్కింగ్‌సరికాదు. చౌటుప్పల్ రెవెన్యూ పరిధిలో గతంలో 4 గుంటల భూమి పోతే.. ఇప్పుడు 7 ఎకరాలు పోతున్నది. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నరు. లక్షల విలువైన ప్లాట్లు కోల్పోతున్నరు. ప్రస్తుతం జంక్షన్‌తో సర్వం కోల్పోతున్నరు. దీనికితోడు మున్సిపాలిటీ కూడా రెండు విభాగాలుగా వీడిపోతుంది.

- చింతల దామోదర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్, చౌటుప్పల్

అప్పు చేసి కొన్న ప్లాట్ పాయె

అప్పో సప్పో చేసి లక్షలు పోసి ప్లాటు కొన్న. మొదటి అలైన్‌మెంట్ ప్రకారం చూస్తే ప్లాటుకు చా